ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 19 మార్చి 2024



ప్రారంభమైన పది పరీక్షలు

● తొలిరోజు 97 శాతం మంది హాజరు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం తెలుగు పరీక్ష జరిగింది. ఈ పరీక్ష 153 కేంద్రాల్లో నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 28,439 మంది హాజరు కావాల్సి ఉండగా 27,616 మంది (97 శాతం) హాజరయ్యారు. పరీక్షల జిల్లా పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి 9 కేంద్రాలను పరిశీలించారు. డీఈవో అనురాధ 7 కేంద్రాలను పరిశీలించారు. వీరు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ప్రతి కేంద్రంలో ఏర్పాటు చేశామన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు సైతం 48 కేంద్రాలను పరిశీలించారు.



పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు



హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



విద్యార్థిని హాల్‌టికెట్ పరిశీలిస్తున్న పరీక్షల పరిశీలకులు క్రిష్ణారెడ్డి, డీఈవో అనురాధ

కోడ్ ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు నమోదు

● ఎన్నికల విధుల్లో అలసత్వం చేస్తే ఉపేక్షించేది లేదు

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆదివారం ప్రొద్దుటూరులో జరిగినదూదేకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు.. ఈ ఘటనలో ఎమ్మెల్యేను మినహాయించి ఆయనకు అటు, ఇటువైపుగా ఉన్న దస్తగిరి, నాగూరుబాబు కోడ్ ఉల్లంఘించారంటూ కేసు నమోదు చేశారు.

ప్రొద్దుటూరు / కడప (కలెక్టరేట్), మార్చి18: ప్రొద్దుటూరులో వైసీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బానును విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ మేరకు ఆర్‌వో కౌసర్‌బాను మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని విచారించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అనుమతులు లేకుండా దూదేకుల ఆత్మీయసభ నిర్వహించినట్లు నిర్ధారించారు. సభకు వచ్చిన మహిళలకు చీరలు పంచిపెట్టేందుకు రశీదులు ఇచ్చినట్టు నిర్ధారించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన దూదేకుల ఆత్మీయ సభ నిర్వాహకులు, వైసీపీ నాయకులు పగిడాల దస్తగిరి, సి.నాగూరుబాబులపై కేసు నమెదు చేయాలని టూటౌన్ సీఐని ఆదేశించారు. ఆ మేరకు వారిపై క్రైం నెంబరు 65/2024 అండర్‌సెక్షన్ 188 రెడ్‌విత్ 34 ఐసీసీ కింద నమోదు చేశారు. ఎన్నికల విధుల్లో బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ఎన్నికల నిఘా అధికారుల వైఫల్యంపై చర్యలేవీ

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి కొర్రపాడు రోడ్డులోని తన స్వంత స్థలంలో దూదేకుల సంఘం వారితో ఆత్మీయ సభ పేరిట ఆ కులం వారి ఓట్లను ప్రభావితం చేసేందుకు సభ పెట్టారు. ఆ సభలో మహిళలకు తాయిలాలుగా చీరల పంపిణీకి రశీదులు ఇచ్చారు. అయితే మీడియా ఉందనే కారణంగా చీరలు తర్వాత ఇస్తామని ప్రకటించి వైసీపీ నాయకులు వెళ్లిపోయారు. దీనిపై రశీదులు తీసుకున్న మహిళలు ఆగ్రహం ప్రదర్శించారు. అక్కడ బహిరంగ సభ జరుగుతున్నా ఎన్నికల నిఘా అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారు? పత్రికలో కథనాలు రాకుంటే వైసీపీవారు కోడ్ ఉల్లంఘన చేసినా అధికారులు పట్టించుకోరా..? ఎంసీసీలో ఉన్న ఫ్లైయింగ్‌స్క్వాడ్‌లు ఏం చేసినట్లు.. అనుమతి లేకున్నా సభ నిర్వహిస్తే నిర్వాహకుల్లో అసలైన అభ్యర్థి మీద కేసు పెట్టకుండా ఇతర నాయకులపై కేసుపెట్టడం ఏమిటి? అని పలువురు విమర్శిస్తున్నారు. కోడ్ అమలులో ఉండగా అనుమతిలేకుండా బహిరంగంగా సభ జరుగుతుంటే దానిని అడ్డుకోవాల్సిన ఎంసీసీ అధికారులు అడ్డుకోకపోవడంపై ఎన్నికల ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు తాము చెప్పే పారదర్శక పనివిధానాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికల విధుల్లో ఏవో నిర్లక్ష్యం

● సస్పెండ్ చేసిన జిల్లా ఎన్నికల అధికారి

కడప(రూరల్), మార్చి 18: పోరుమామిళ్ల ఏవో రమణయ్య ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) విజయరామరాజు సోమవారం సస్పెండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏవో రమణయ్యకు కాశినాయన, కలసపాడు మండలాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ డ్యూటీ వేశారు. ఈ మేరకు బద్వేల్ ఆర్డీవో తన పరిధిలోని ఎన్నికల విధుల్లో ఉన్నవారితో మూడు రోజుల క్రితం జూమ్ మీటింగ్ ఏర్పాటు చేయగా రమణయ్య గైరుహాజరు కావడమే కాకుండా తర్వాత కూడా నిర్లక్ష్యంగా వ్యహరించారు. తనకు కూడా 3 రోజుల నుంచి అందుబాటులో లేరని ఆర్డీవోకు పోరుమామిళ్ల ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో సోమవారం జడ్పీకి రిపోర్టు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా ఎన్నికల అధికారి(కలెక్టర్) ఏవో రమణయ్యను సస్పెండ్ చేశారు.

స్ట్రాంగ్ రూము భద్రతపై ప్రత్యేక దృష్టి అవసరం

● కలెక్టరు విజయరామరాజు

కమలాపురం రూరల్, మార్చి 18: ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ ఎంత పకడ్బందీగా చేపడతామో అంతే జాగ్రత్తగా బ్యాలెట్ యూనిట్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. సోమవారం కమలాపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటరు/ రిసెప్షన్ కేంద్రాన్ని అసెంబ్లీ నియోజకవర్గ స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ ఫారాలు భద్రపరచడం కోసం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జేసీ గణేశ్‌కుమార్, ఎన్నికల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ భద్రతపై రిటర్నింగ్ అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఓటింగ్ అనంతరం స్ట్రాంగ్ రూము నిర్వహణపై మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, ఏఆర్‌వో కమలాపురం తహసీల్దారు సుబ్రమణ్యం, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టరు, ఎస్పీ అధికారులు

వైసీపీ నేతలా.. మజాకా..

● యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

● కడపలో చీరలు, ప్రొద్దుటూరులో గోడగడియారాలు పంపిణీ

● అంగన్వాడీలకు జగనన్న బొమ్మతో ఉన్న పౌష్టికాహారం అందజేత

● ఇంకా తొలగించని వైసీపీ ఫ్లెక్సీలు, స్టిక్కర్లు





కడపలో మా నమ్మకం నువ్వే జగన్ అంటూ అంగళ్లవద్ద పెట్టిన బోర్డు

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలకు రాజ్యాంగం ప్రకారం పాలన చేయమంటే ఇష్టమున్నట్లు లేదు. అధికారం చేపట్టిన నాటి నుంచి జగన్ అండ్ కో అన్ని వ్యవస్థల్లో చొరబడి నాశనం చేశారన్న విమర్శ ఉంది. ఇప్పుడు కూడా మేమేం చేసినా చెల్లుతుంది, మాదే రాజ్యం అనుకున్నట్టు ఉన్నారు. ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఎక్కడా ఎన్నికల నియమావళిని పాటించడం లేదు. దీనిని ప్రశ్నించాల్సిన అధికారులు సైతం వైసీపీ నేతలకు దాసోహం అంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూలు వెలువడి మూడు రోజులుగా కోడ్ అమల్లో ఉంది. అయినా కొన్ని చోట్ల వైసీపీ నేతలు ఎన్నికల కోడ్‌ను లెక్కచేయడం లేదు. ఇష్టారాజ్యంగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి.

ఉల్లంఘన ఇలా..

● ప్రొద్దుటూరులో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దూదేకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసిన తాయిలాలు ప్రకటించారు. ఇది ఎన్నికల కోడ్‌కు విరుద్ధం. రంజాన్ పేరిట చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారంటారు. మహిళలకు టోకన్లు ఇచ్చారు. ఈ వార్తను ఆంధ్ర జ్యోతి ప్రముఖంగా ప్రచురించింది. ఈ వ్యవహారంలో వైసీపీ నేతలపై కేసు నమోదు చేయకుండా దూదేకుల దస్తగిరి, నాగూరు అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకోవడం విమర్శలకు తావిచ్చింది.

● ఆ ఘటన మరిచిపోకముందే ప్రొద్దుటూరులో వైసీపీ నేతలు వలంటీర్లకు గోడ గడియారాలు ఇచ్చి ప్రలోభాలకు తెరలేపారని చెబుతున్నారు. వలంటీర్లకు ఇచ్చిన గోడ గడియారంలో సీఎం జగన్, ఎంపీ అవినాశ్ రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు ఫొటోలు ముద్రించి పంపిణీ చేయడం గమనార్హం. ఒక్క రోజు వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికల ఉల్లంఘటన చోటు చేసుకోవడం గమనార్హం.

● కడప నగరంలోని 28వ డివిజన్‌లో ఓ వైసీపీ నేత రంజాన్ పేరిట మహిళలకు చీరలు పంపిణీ చేసే కార్యక్రమానికి తెర లేపారంటారు. ఆ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి మహిళలకు టోకన్లు ఇచ్చారు. టోకన్లు తీసుకున్న మహిళలు ఆ వైసీపీ నేత ఇంటి వద్ద గుమికూడడం గమనార్హం.

● ఎన్నికల నియామావళి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి, మంత్రులతో సహా ఇతరుల ఫొటోలు ఎక్కడా ఉండకూడదు. గోపవరం మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ పోషణ కింద గర్భిణీ స్త్రీలు, బాలింతలకు కిట్లు అందించారు. వీటిపై జగన్, ఆయన తండ్రి వైఎస్సార్ ఫొటోలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ముద్ర, వైసీపీ జెండా పోలిన రంగు ముద్రించి ఉండటం గమనార్హం.

తొలగని ఫ్లెక్సీలు

ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగసభలు, ప్రైవేటు ఆస్తుల వద్ద ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టిక్కర్లను తొలగించాల్సి ఉంది. అయితే కడప నగరంలో చాలా వరకు ఫ్లెక్సీలు తొలగించలేదు. సోమవారం ఉదయం 10.30 ప్రాంతంలో రామక్రిష్ణనగర్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్' అనే బోర్డు ఉంది. రామక్రిష్ణనగర్‌లో దుకాణాలకు సైతం మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులు కనిపించాయి. పుట్లంపల్లె శ్రీరామ్‌నగర్ కాలనీ, చిన్నచౌకు నెహ్రూనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ బోర్డులు ఉన్నాయి. ఏపీ హెచ్‌బీ కాలనీలో సిద్ధం బోర్డు, ఆర్టీసీ బస్టాండు వద్ద మధ్యాహ్నం 12.20 గంటలకు వెళుతున్న ఓ ఆటోపై సిద్ధం పోస్టరు కనిపించింది. ఇక మోచంపేటలో సాయంత్రం ఓ కారుపై 'జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం' అనే స్టిక్కర్లు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన జరుగుతుండడం గమనార్హం. ఇంకా రాబోవు రోజుల్లో ఎన్నెన్ని చిత్రాలు చూడాల్సి వస్తుందో మరి.



ప్రొద్దుటూరులో వైసీపీ నేతలు వాలంటీర్లకు పంపిణీ చేసిన గోడ గడియారం

జమ్మలమడుగు టీచర్స్ కాలనీలో ఈకార్డ్ భవనం వద్ద మా నమ్మకం నువ్వే జగన్ ఫొటో ఉన్న దృశ్యం



జమ్మలమడుగులో..

జమ్మలమడుగు, మార్చి 18: డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పెద్దపసుపుల మోటు సమీపాన టీచర్స్ కాలనీలో పలు చోట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్లు, ఫొటోలు దర్శనమిస్తున్నాయి. పలు దుకాణాల వద్ద సైతం 'మా నమ్మకం నువ్వే జగన్' బోర్డులు అలానే ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రెండు రోజులు దాటినా సంబందిత అధికారులు జగన్‌మోహన్‌రెడ్డికి సంబంధించిన స్టిక్కర్లు, ఫొటోలు తొలగించలేదు.

నర్సాపురంలో..



నర్సాపురంలో అధికార పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఫొటోలతో వాహనం

కాశినాయన మార్చి18: మండల కేంద్రమైన నర్సాపురంలోనూ కోడ్ ఉల్లంఘన జరిగింది. ఇక్కడి జడ్పీ ఉన్నతపాఠశాలకు ఎదురుగా ప్రధాన రహదారి పక్కన తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాలకు సమీపంలో అధికార పార్టీనేతలకు సంబంధించిన పెద్దపెద్ద బ్యానర్లు, పోస్టర్లతో ఓ ప్రైవేట్ వాహనం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిచ్చింది. అధికార పార్టీకి ఎన్నికల నిబంధలు వర్తించవా అంటూ ఆ దారి వెంట వచ్చిపోయేవారు ప్రశ్నిస్తున్నారు.



గోపవరంలో అంగన్వాడీలకు సోమవారం పంపిణీ చేసిన కిట్లపై జగన్ బొమ్మ

ముంచుకొస్తున్న నీటి ముప్పు



మైలవరం జలాశయం వద్ద పంప్‌హౌస్‌లోకి వెళ్లే నీరు అడుగంటిన దృశ్యం



మైలవరం పంప్‌హౌస్‌లో అడుగంటి చివరి రంధ్రం వద్ద చేరిన నీరు



మైలవరం జలాశయం నుంచి తాగునీటిని సరఫరా చేసే పంప్ హౌస్‌లు

● మైలవరం జలాశయంలో అడుగంటిన జలాలు

● జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కడప నగరానికి..

● మరో పదిరోజుల్లో నీటి సరఫరా ప్రశ్నార్థకం

● ముందస్తు చర్యలు చేపట్టని అధికారులు

జమ్మలమడుగు, మార్చి 18: జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం జలాశయంలో నీళ్ల అడుగంటాయి. ప్రస్తుతం గేట్ల వద్ద నుంచి పురాతన శివాలయం ప్రాంతం వరకు జలాశయంలో ఒకవైపు నీరు లేక ఎండిపోయింది. గేట్ల వద్ద మాత్రమే అంతంత మాత్రమే నీరు ఉంది. ఈ జలాశయం నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం ద్వారా మైలవరం, పెద్దముడియం మండలాల్లోని ఆయా గ్రామాలకు, జమ్మమడుగు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలతో పాటు కడప నగరానికి తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. ప్రస్తుతం కొన్ని గ్రామాలకు మాత్రమే నీరు అందిస్తున్నారు. పంప్‌హౌస్ వద్ద జలాశయంలో నీళ్ల అడుగంటి చివరి రంధ్రం వద్దకు చేరుకున్నాయి. దీంతో పైపులకు మోటార్లు వేసినా అంతంతమాత్రంగానే పంప్ హౌస్‌కు నీరు చేరుతోందని అంటున్నారు. పది రోజులకు మించి నీరు సరఫరా కాదని సమాచారం. అలాగే మైలవరం జలాశయంలో పక్కనే ఉన్న మరో పంప్‌హౌస్ వద్ద నుంచి దొమ్మరనంద్యాల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శుద్ధి కేంద్రం వరకు నీటిని తరలించి అక్కడి నుంచి జమ్మలమడుగు పట్టణానికి సరఫరా చేస్తారు. మైలవరం జలాశయంలో ఆ పంప్‌హౌస్ వద్ద సైతం నీరు అడుగంటింది. దాని పక్కనే మరొక కొత్త పంప్‌హౌస్ వద్ద నుంచి ప్రొద్దుటూరు రామేశ్వరం చివరి భాగంలో రెండుకుళాయిలు వద్ద ఉన్న శుద్ధి కేంద్రానికి నీరు తరలిస్తున్నారు. అలాగే కడప కార్పొరేషన్‌కు కూడా ఇదే నీటిని సరఫరా చేస్తున్నట్లుగా అధికారుల ద్వారా తెలుస్తోంది. జలాశయంలో నీరు అడుగంటడంతో ఈ ప్రాంతాలకంతా తాగునీటి ముప్పు పొంచి ఉంది.

అధికారి ఏమన్నారంటే..

జలాశయంలో నీరు అడుగంటడంతో పొంచిఉన్న తాగునీటి సమస్య గురించి మైలవరం, ఇరిగేషన్ శాఖ ఏఈ గౌతమ్‌రెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా.. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 0.382 టీఎంసీల నీరు మాత్రమే ఉందన్నారు. దీంతో పంప్‌హౌస్‌ల వద్ద సమస్య ఉందన్నారు. మైలవరం జలాశయం నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, జమ్మలమడుగు, ఆర్టీపీపీ, మైలవరం, పెద్దముడియం మండలాల్లోని గ్రామాలకు నీరు సరఫరా అవుతుందన్నారు. జలాశయంలో నీరు అడుగంటిపోయి ఇబ్బందికరంగా ఉందని ఉన్నతాధికారులకు తెలియజేశామని వివరించారు. త్వరలో గండికోట జలాశయం నుంచి కొంత మేర నీటిని విడుదల చేయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నీరు అందితేనే పై ప్రాంతాలకు పంప్‌హౌస్‌ల వద్ద నుంచి నీరు సరఫరా అవుతుందని లేదంటే నీటి సమస్య తప్పదని ఆయన పేర్కొన్నారు.



అడుగంటిన మైలవరం జలాశయం

ప్రశ్నార్థకంగా చెత్త సంపద కేంద్రాలు

- రాబడి తక్కువ... ఖర్చులు ఎక్కువ
- భారంగా మారిన నిర్వహణ
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- నిరుపయోగంగా మారుతున్న కేంద్రాలు

సంబేపల్లె, మార్చి 18: గత ప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామ పంచాయతీ ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించింది. ఒక్కో కేంద్రానికి రూ.8 నుంచి 10 లక్షల వరకు ఖర్చు చేసి మండలంలో సరాసరి 15 నుంచి 20 కేంద్రాలు నిర్మించారు. నాడప్ కంపోస్టుల ద్వారా చెత్త నుంచి ఎరువులను తయారు చేసి రైతులు పంట సాగులో రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడుకునే విధంగా గ్రామ పంచాయతీ ఆదాయాలను పెంచాలనుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణ చేపట్టి తద్వారా సంపదను సృష్టించవచ్చని భావించారు. ఇందుకోసం గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా సంపద కేంద్రాల కోసం సుమారు 50 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. పథకం ఉద్దేశ్యం మాత్రం గొప్పది అయినా.. ప్రస్తుత ప్రభుత్వం ఈ కేంద్రాల బాగోగులు పట్టించుకోకపోవడంతో లక్ష్యం నీరు గారిందనే చెప్పవచ్చు.



పిచ్చిమొక్కలు మొలిచిన నాడఫ్ కంపోస్టు పిట్

సక్రమంగా సాగని చెత్త సేకరణ

సంబేపల్లె మండలంలో 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. 34 మంది గ్రీన్ అంబాసిడర్లను ఏర్పాటు చేశారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేలు అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి కేంద్రానికి తరలిస్తారు. అక్కడ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు, గాజు పరికరాలు, ఇనుప వస్తువులు ఇలా వేరు వేరుగా వేరు చేసి తడి, పొడి చెత్తగా విభజించాలి. అయితే మండల వ్యాప్తంగా చెత్త సేకరణ చాలా గ్రామాల్లో జరగడం లేదు. చెత్త నుంచి వేరు చేసిన ప్లాస్టిక్, గాజు సీసాలు, ప్లాస్టిక్ ద్వారా నెలకు కొన్ని కేంద్రాల్లో రూ.200 మరి కొన్ని కేంద్రాల్లో రూ.500 నుంచి రూ.1500 వరకు ఆదాయం వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో 34 మంది గ్రీన్ అంబాసిడర్లకు నెలకు రెండు లక్షల రూపాయలు జీతాల ద్వారా చెల్లించాలి. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం వేలల్లో ఉంది. దీంతో రాబడి తక్కువ ఖర్చులు ఎక్కువ కావడంతో ఈ కేంద్రాల నిర్వహణ కష్టతరంగా మారింది.



చెత్త సంపద తయారీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అరలు



చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రం

నాడప్ కంపోస్ట్ పిట్‌లో పిచ్చిమొక్కలు

పంచాయతీ పరిధిలోని ఒక్కో హ్యాబిటేషన్‌లో ఒక రైతుకు నాడప్ కంపోస్టు పిట్ కోసం 12 వేల రూపాయలు అంచనాతో సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా వీటిని నిర్మించారు. అయితే ఎక్కడా కంపోస్టు ఎరువులు మాత్రం తయారు చేయడం లేదు. పిచ్చిమొక్కలు మాత్రం కనిపిస్తున్నాయి. వేల రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా వదిలేశారు.

అసంపూర్తిగా వదిలేశారు....

మండల వ్యాప్తంగా 15 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. శెట్టిపల్లి గ్రామంలో గాండ్లపల్లి వద్ద ఇప్పటికీ పిల్లర్ దశలో నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల గదులు నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పుడైనా అధికారులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పూర్తి స్థాయిలో జరగడం లేదు

మండలంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో జరగడం లేదు. కొన్ని చోట్ల సేకరణ ద్వారా ప్లాస్టిక్, ఇనుము, గాజు సీసాలు, గుజిలీకి అమ్మడం ద్వారా కొంత ఆదాయం వస్తుంది. సేంద్రియ ఎరువు మాత్రం తయారు కావడం లేదు.

-రవీంద్ర, ఈవోపీఆర్‌డీ, సంబేపల్లె మండలం

సమాజ అవసరాలను తీర్చేలా విద్యావిధానం

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : జాతీయ విద్యావిధానం 2020 ద్వారా సమాజ అవసరాలను తీర్చేలా విద్యావిధానం రూపొందించారని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ తెలిపారు. సోమవారం యునిసెఫ్, వైవీయూ, ఏపీ ఉన్నత విద్యామండలి ఓట్ ఫర్ కమ్యూనిటీ డెవల్‌మెంటు త్రూ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటు ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. అంతర్జాతీయ స్థాయి అవకాశాలు అందుకునేలా, సమాజంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపేలా కరికులం ఉందన్నారు. విద్యార్థులు సమాజంలో ఒక భాగమని, వారి వారి ప్రాజెక్టుల్లో భాగంగా గ్రామాల్లోకి వెళ్లినప్పుడు సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. వీలైతే పరిష్కార మార్గాలు కూడా చూపాలన్నారు. దేశాభివృద్ధికి ఆటంకాలుగా మారిన సామాజిక రుగ్మతలన తొలగించే దిశగా అధ్యయనం చేయాలన్నారు. ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, యునిసెఫ్ కన్సల్టెంట్ స్వాతి, శిక్షణ ఫౌండేషన్ ఆపరేషన్ మేనేజరు ఎ.అప్పారావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిగ్రీకళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశోధనాభిరుచి అనువణువునా నిలుపుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : పరిశోదనాభిరుచి గల స్కాలర్లే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయగలరని వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. సోమవారం వైవీయూ డిపార్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో సామాజిక శాస్త్ర పరిశోధకుల కోసం పరిశోధనా పద్ధతి ఏకవిశ్లేషణ అంశంపై అతిథి ఉపన్యాసం చేశారు. ఎకనామిక్స్ శాఖ విభాగాధిపతి ప్రొఫెసరు అనిత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ స్కాలర్లు యాంత్రికంగా కాకుండా ఒక నిబద్ధతతో పరిశోధనలు సాగించాలన్నారు. అలా చేసినప్పుడే ఉత్త మ ఆవిష్కరణలతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పరిశోధనపత్రాలు ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితం కావాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య బెంగుళూరు సెంటర్ ఆఫ్ ఎకనామిక్స్ స్టడీస్ అండ్ పాలసీ ఇనిస్టిట్యూట్ ఫర్‌సోషల్ అండ్ ఎకనామిక్స్ ప్రొఫెసరు డీన్ క్రిష్ణరాజ్ సామాజికశాస్త్ర పరిశోధకులు పరిశోధన పద్ధతి ఏక విశ్లేషణ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, గణేశ్‌నాయక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిన్నాన్న చేతిలో బాలుడు దారుణ హత్య

పులివెందుల రూరల్, మార్చి 18: పులివెందుల పట్టణంలో ఓ బాలుడు తన చిన్నాన్న చేతిలో దారుణ హత్యకు గురయ్యా డు. తల్లి అనురాదదేవి ఫిర్యాదు మేరకు సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నగరిగుట్టలో అనురాదదేవి ఆమె కుమారుడు రెడ్డిబాబు (15) నివాసముండేవారు. వారి ఇంటి పక్కనే రెడ్డిబాబు చిన్నాన్న సురేష్ ఉండేవాడు. ఇతని మానసిక స్థితి సరిగా లేని కారణంగా రెడ్డిబాబు కుటుంబమే అతనికి భోజనం అందించేది. సురేష్‌కు పెళ్లి కాలేదు. రెడ్డిబాబు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటూ ఉదయం పేపర్‌బాయ్‌గా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం ఉదయం తల్లి అనురాదదేవి తమ కుమార్తె అనారోగ్యంతో ఉండడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లింది. ఇంటికి వచ్చే సరికి అపస్మారకస్థితిలో పడి ఉన్న రెడ్డిబాబును చూసిన తల్లి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యు లు నిర్ధారించారు. బాలుడి చిన్నాన్న పరారీలో ఉన్నాడు. బాలుడి చిన్నాన్న సురేష్ తమ బిడ్డను హత్య చేశాడని తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మృతి చెందిన బాలుడు రెడ్డిబాబు

రాజంపేట పట్టణంలో చోరీ

- 25 గ్రాములు బంగారు, రూ.12 వేలు నగదు చోరీ

రాజంపేటటౌన్, మార్చి 18: రాజంపేట పట్టణ, మండల పరిధిలో గత కొన్ని రోజులుగా ఎక్కడపడితే అక్కడ దొంగలు మాటువేసి ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున పట్టణంలోని ఉస్మాన్ నగర్‌లో అలియా అనే మహిళ ఇంటిలో చోరీకి పాల్ప డ్డారు. 25 గ్రాముల బంగారు, రూ.12 వేల నగదు చోరీ చేశారు. ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఇంటిలోకి చొరబడి తలుపు పగలగొట్టి బీరువా, కబోర్డులలో వస్తువులను చెల్లాచెదురు చేసి అందులో ఉన్న నగదు, బంగారు చోరీ చేసినట్లు బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పట్టణ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు.

పదో తరగతి విద్యార్థిని మృతి



రాజుపాలెం, మార్చి 18: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన శ్రీపతి లిఖిత (15) అనే పదో తరగతి విద్యార్థిని అకస్మాత్తుగా మృతి చెందింది. లిఖిత ఉదయం జడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి తెలుగు పరీక్షకు హాజరైంది. పరీక్ష రాసి వచ్చిన తరువాత భోజనం ముగించుకుని పాఠశాలకు వెళ్లి మరో పరీక్షకు ప్రిపేర్‌వుతున్న సమయంలో విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. ప్రైవేటు పాఠశాల యాజమాన్యం విద్యార్థినిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అనంతరం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిస్తుండగా బాలిక మృతి చెందింది. లిఖిత గత కొన్నేళ్లుగా గుండెకు సంబంధించి వ్యాధితో బాధపడుతున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. బాలిక మృతితో తల్లిదండ్రులు దుఃఖసాగరంలో మునిగి పోయారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై ఘర్షణ

జమ్మలమడుగు, మార్చి 18: జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పెన్నానది వంతెన వద్ద ఆదివారం రాత్రి సుమారు 12.30 గంటల ప్రాంతంలో వంతెన కింద సుమారు 10 మంది గొడవపడినట్లుగా తెలుస్తోంది. ప్రతిరోజు పగలు, రాత్రి పెన్నానది వంతెన సమీపాన గూడెం చెరువు, పొన్నతోట ప్రాంతం నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అయితే కొందరు ఇసుక ట్రాక్టర్లు పట్టించారని, మరికొందరు బయటి వ్యక్తులకు సమాచారం ఇస్తున్నారని తదితర కారణాలతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. రెడ్డప్ప అనే వ్యక్తి గతంలో ఎస్ఈబీ సీఐ వద్ద డ్రైవర్‌గా పనిచేసినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ట్రాక్టర్ పెట్టుకుని ఇసుక రవాణా చేస్తున్నాడు. ఆయనతోపాటు మరికొందరు పెన్నానది నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏం జరిగిందే ఏమో కానీ శివ, రెడ్డప్ప అనే వ్యక్తులు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వీరితో మరికొందరు గొడవ పడినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం తెలుసుకున్న అర్బన్ పోలీసులు వారిద్దరిని అదుపు లోకి తీసుకుని.. ఘటనపై విచారణ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఉమామహేశ్వరి మృతదేహం

పెనుకొండ రూరల్, మార్చి 18 : శ్రీసత్యసాయి జిల్లా మండల పరిధిలోని అమ్మవారిపల్లి సమీపంలో కోటక్ కంపెనీ ఎదురుగా 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమామహేశ్వరి(34) మృతి చెందగా, కుటుంబ సభ్యులు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. కడప జిల్లా జమ్ములమడుగు పట్టణానికి చెందిన మురళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన, భార్య ఉమామహేశ్వరి కొన్నేళ్ల కిందట బెంగళూరులోనే ఉద్యోగం చేసుకుంటూ స్థిరపడ్డారు. వారికి ఇద్దరు పిల్లలు. వారు మూడు రోజుల కిందట కారులో హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అమ్మవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమామహేశ్వరి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త మురళి, కుమారుడు చైతన్య, కుమార్తె శ్రీనిధి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలికపై అత్యాచారం

ఐదుగురిపై ఫోక్సో కేసు నమోదు

ప్రొద్దుటూరు, మార్చి 18: ప్రొద్దుటూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన లింగం కిరణ్ అనే వ్యక్తి 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్ప డ్డాడు. ఈ ఘటనపై బాలిక కుటుంబసభ్యులు ప్రొద్దుటూరు రూరల్ పోలీ సులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాలికపై అత్యాచారానికి కిరణ్‌అతని బంధువులు సహకరించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు కిరణ్‌తో పాటు మరో నలుగురుపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఈవీయం గోడౌన్ వద్ద నిరంతరం నిఘా ఉండాలి

రాయచోటిటౌన్, మార్చి 18: ఈవీయంలు భద్రపర్చిన గోడౌన్ వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట మార్కెట్ యార్డులో ఉన్న ఈవీయం గోడౌన్‌ను ఎస్పీ కృష్ణారావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 4893 బీయూలు, 4220 సీయూలు, 4847 వీవీ ప్యాట్‌లు వచ్చాయని, వీటన్నింటినీ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం వివిధ అంశాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవీయం గోడౌన్‌కు సంబంధించిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణ, ఆర్డీవో రంగస్వామి, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాసాపేట మార్కెట్ యార్డులో గోడౌన్‌లో ఈవీయంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ కృష్ణారావు

ఒకేసారి రెండు చెవులకు విజయవంతంగా ఆపరేషన్

- రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా చేశాం
- తిరుమల హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సురేంద్రబాబు వెల్లడి



శస్త్రచికిత్స పొందిన చిన్నారులు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18: కడప నగరంలోని తిరుమల హాస్పిటల్‌లో ఒకేరోజు ఒకేసారి ఎస్.అబ్దుల్‌హబీబ్ (3) అనే చిన్నారికి రెండు చెవులకు బైనారల్ కాక్లియర్ ఇన్‌ప్లాంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్ల తిరుమల హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సురేంద్రబాబు వెల్లడించారు. సోమవారం తిరుమల హాస్పిల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుల్లంపేటకు చెందిన ఎస్.అబ్దుల్‌వాహబ్ రేష్మా కుమారుడైన అబ్దుల్ హబీబ్‌కు పుట్టుకతోనే చెవిటి, మూగ. ఆ చిన్నారికి మా హాస్పిటల్‌లో ఒకేసారి రెండుచెవులకు నిర్వహించిన కాక్ క్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. సాధారణంగా కాక్లియర్ ఇంప్లాంట్‌సర్జరీ పిల్లలకు మూడేళ్లలోపు ఉంటే ముందుగా ఒక చెవికి చేయడం జరుగుతుందన్నారు. తదుపరి కొంత కాలం వ్యవధి తీసుకుని రెండోచెవికి సర్జరీ చేస్తారని తెలిపారు. ఇలా చేయడాన్ని సీక్వెన్షియల్ బైనారల్ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ అంటారన్నారు. అయితే ఒకేసారి రెండుచెవులకు కాక్ క్లియర్ ఇంప్లాంట్ సర్జరీ చేసి విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. సర్జరీ విజయవంతం కావడంలో అనస్థీషియా స్పెషలిస్టు డాక్టర్ రాఘవేంద్ర సహకించారన్నారు. అలాగే ప్రవల్లిక (4) అనే చిన్నారికి ఒక చెవికి సర్జరీ జయప్రదంగా చేసినట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇరువురు చిన్నారులకు ఉచితంగా సర్జరీ నిర్వహించామని డాక్టర్ సురేంద్రబాబు తెలిపారు.

ట్యూబ్ లీక్‌తో ఆగిన 600 యూనిట్

ఎర్రగుంట్ల, మార్చి 18: ఆర్టీపీపీలోని 600 మెగావాట్ల సామర్థ్యంతో నడిచే 6వ యూనిట్ సోమవారం సాయంత్రం 5.30గంటల సమయంలో ట్యూబ్‌లీక్‌తో ఆగింది. దీన్ని మంగళవారం రెక్టిఫై చేసి సాయంత్రానికి లైటప్ చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వేసవి కావడంతో ఆర్టీపీపీలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు భారీ డిమాండ్ ఉంది. మొత్తం ఆరు యూనిట్లను ఏకధాటిగా నడుపుతున్నారు. ఆరవ యూనిట్ ఆగిపోవడంతో మిగతా 5యూనిట్లను పూర్తి స్థాయి విద్యుదుత్పత్తితో నడుపుతున్నారు. బొగ్గు కూడా సుమారు 80వేల మెట్రిక్ టన్నులు స్టాకు ఉంది.

విద్యుత్తు షాక్‌కు ఒకరు మృతి

ఖాజీపేట, మార్చి 18: మండల పరిధిలోని సుంకేసుల హరిజనవాడలో విద్యుత్తు షాక్‌తో ఓబులేసు (51) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే... ఆదివారం రాత్రి ఇంటిలో కరెంటు పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు సరఫరా కావడంతో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం మైదుకూరుకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులుయాదవ్‌లు ఓబులేసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గుండెపోటుతో ఏఎస్ఐ మృతి

తంబళ్లపల్లె, మార్చి 18: తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఎం.రెడ్డప్ప నాయక్(51) ఆదివారం రాత్రి విధి నిర్వహణలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. రెడ్డప్పనాయక్ కొన్ని నెలలుగా పీటీయం మండలం చెంద్రాయనిపల్లె సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్నాడు.

నువ్వుల రైతుకు ధరల పోటు


- 20 రోజులలో రూ.18వేల నుంచి రూ.9వేలకు దిగొచ్చిన ధర



నువ్వుల పంట కోసి కుప్పలు వేస్తున్న రైతులు

వేంపల్లె, మార్చి 18: అరుగాలం రైతులు శ్రమించి ఏ పంట పండించినా గిట్టుబాటు ధరలు లేక లబోదిబోమంటూ వచ్చిన కాడికే అమ్ముకుంటున్నారు. 20రోజుల వ్యవధిలోనే క్వింటాల్ రూ.18వేలు ఉన్న నువ్వుల ధర రూ.9వేలకు వచ్చిందంటే రైతు పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వేంపల్లె మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో వందల ఎకరాల్లో నువ్వుల పంట సాగుచేశారు. గత నవంబరు, డిసెంబరులలో పంట సాగుచేయగా ఇప్పటికే పలువురు రైతులు పంటను కోశారు. ప్రస్తుతం కోస్తున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30వేలకు పైగా ఖర్చు చేసి పంట సాగు చేయగా.. ఎకరా కు మొస్తరుగా పండితే ఐదు క్వింటాళ్ల వరకు పండుతున్నాయి. పంట అయితే చేతికొచ్చింది కానీ రోజురోజుకు ధర తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. 20రోజుల క్రితం క్వింటాల్ రూ.18వేలు ఉంది. ఈ ధర రోజురోజుకు తగ్గిపోయి ప్రస్తుతం రూ.9వేల నుంచి రూ.10వేల మధ్య ఉంది. ఈ ధర పెట్టుబడికే సరిపోతోందని ఆవేదన చెందుతున్నారు. ఇక అరకొరగా పండిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్రోకర్ల మాయాజాలం రైతులకు నిల్వ చేసుకొని గిట్టుబాటు ధర వచ్చినపుడు అమ్ముకునే వీలు లేకపోవడం వల్ల ఈ దుస్థితి దాపురించింది.



పండించిన నువ్వుల మూటెలతో దిగాలుగా రైతు

రూ.9500కు అమ్ముకున్నాం

ఐదెకరాల్లో నూగుపంట సాగుచేశాం. క్వింటా రూ.9500 విక్రయించాం. 20రోజుల క్రితం ధర బాగుండేది. ఎందుకనో ధర తగ్గిపోయింది. గిట్టుబాటు ధర ఉంటే అంతో ఇంతో లాభపడేవాళ్లం. పంట పండిన ప్రయోజనం లేకుండా పోయింది.

-శ్రీలక్ష్మి, మహిళా రైతు, వేంపల్లె

గిట్టుబాటు ధర కల్పించాలి

రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తే ఉపయోగం ఉంటుంది. ధరల స్థిరీకరణ నిధి ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నువ్వుల పంట సాగుచేస్తే ధర లేక పెట్టుబడి, ఖర్చులకే సరిపోతోంది. మూడు నెలల పాటు చేసిన శ్రమ అంత వృథా అయింది.

శేఖర్, రైతు, చింతలమడుగుపల్లె, వేంపల్లె.

దేవునికడప ఆలయ హుండీ లెక్కింపు

కడప (కల్చరల్), మార్చి 18 : దేవునికడపలో వెలసిన సోమేశ్వర స్వామి దేవాలయం హుండీ లెక్కింపు సంబంధిత దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించారు. గత జనవరి 18 నుంచి ఈ నెల 18 వరకు సరిగ్గా రెండు నెలలకు గాను స్వామివారి సేవలో తరించడానికి వచ్చిన భక్తుల ద్వారా హుండీలో సమర్పించిన ఆదాయం రూ.35, 877 వచ్చినట్లు తెలిపారు. ఇందులో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.శ్రీధర్, శ్రీనివాసులు, ఆలయ ప్రధాన అర్చకులు వై.మురళి జగన్నాథ, ఎం.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేడు కడపలో వామపక్షాల సదస్సు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 18 : మత సామరస్యాన్ని, దేశ సమైక్యతను రక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న ఉదయం 10 గంటలకు నగరంలోని హెచిమన్ భవన్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ తెలిపారు. సోమవారం నగరంలోని పాతబస్టాండులో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో నగర కార్యదర్శి రామ్మోహన్ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నివసిస్తున్న అన్ని వర్గాల ప్రజలు భారతీయులేనని గుర్తుంచుకోవాలన్నారు. దేశ ప్రజల మధ్య చీలికలు తెచ్చి విచ్ఛిన్నానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి మృతి'

చెన్నూరు, మార్చి 18 : చెన్నూరు సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి జయమ్మ (72) సోమవారం మృతి చెందారు. ఆమె గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతదేహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి నివాళులర్పించారు. అలాగే వివిధ మండలాలకు చెందిన అన్ని పార్టీల నేతలు హాజరై నివాళులర్పించి తమ సంతాపం తెలిపారు.

'విద్యార్థిని చితకబాదిన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 :కడప నగరంలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని చితకబాదాడని, ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కె.సుబ్బరాయుడు, ఎం.అంకన్న, జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం పీఎస్‌యూ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 1వ తరగతి విద్యార్థిని కొట్టడం దారుణమన్నారు. ఈ విషయాన్ని డీఈవో దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెండర్ల ప్రక్రియ వాయిదా

పులివెందుల టౌన్, మార్చి 18: పులివెందుల మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న మున్సిపల్ గదులకు సోమవారం నిర్వహించాల్సిన టెండర్ ప్రక్రియ వాయిదా వేసినట్లు కమీషనర్ రమణారెడ్డి తెలిపారు. ఖాళీ గదులకు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్ల ప్రక్రియ పరిపాలన సౌలభ్యం దృష్ట్యా వాయిదా వేశామన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

వేంపల్లె, మార్చి 18: ఉచిత విద్యాహక్కు చట్టం ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు జాఫార్ సాదిక్, స్టాలిన్ ఐజాక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

మోదీ ప్రసంగంలో జగన్ ప్రస్తావనే లేదెందుకు: తులసిరెడ్డి

వేంపల్లె, మార్చి 18: ప్రజాగళం సభలో ప్రధాని మోదీ చేసిన ప్రసంగంలో ముఖ్యమంత్రి జగన్ ప్రస్తావన ఎందుకు తేలేదని, దీన్ని బట్టి బీజేపీతో వైసీపీది పరోక్ష పొత్తు, టీడీపీ, జనసేనలది ప్రత్యక్ష పొత్తు అనేది స్పష్టమవుతోందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌తో మాత్రమే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఏపీకి దక్కాల్సిన విభజన హామీలు అమలు అయ్యేది ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందన్నారు. మీడియా సమావేశంలో ధ్రువకుమార్‌రెడ్డి, రామకృష్ణ, సుబ్రమణ్యం, నరసింహారెడ్డి, అమర్, ఉత్తన్న, శివ, సుబ్బరాయుడు, రవి, వినయ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అమర వీరుల వర్ధంతిని జయప్రదం చేయండి

కడప (నాగరాజుపేట), మార్చి 18 :భారత స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు భగత్‌సింగ్ షాహిద్, రాజ్ గురు సుఖదేవ్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న జరుగు కార్యక్రమాలను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. సోమవారం జిల్లా డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలు సైతం అర్పించిన త్యాగధనులు భగత్‌సింగ్, రాజ్ గురు సుక్‌దేవ్‌లు కూడా ఉన్నారన్నారు. వారి త్యాగాల స్ఫూర్తితో డీవైఎఫ్ఐ యువజన సంఘం యువజన సమస్యలపై నిత్యం పోరాడుతుందన్నారు. వారి వర్ధంతిని ఈనెల 23న జరపనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా సేవకుడు చంద్రబాబును గెలిపిద్దాం: పుత్తా

కమలాపురం రూరల్, మార్చి 18 : ప్రజా సేవకుడు చంద్రబాబును రానున్న ఎన్నికల్లో గెలిపిద్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని పందిళ్లపల్లె, తురకపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల కాలంలో ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు. నవరత్నాల పేరుతో ప్రజలను మోసగిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పి చేతులెత్తేశారన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి అందించారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్ని రకాల రుణాలు అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని కార్పొరేషన్లు నిర్వీర్యం చేసిందన్నారు.



టీడీపీలో చేరుతున్న వారికి కండువా వేసి స్వాగతం పలుకుతున్న పుత్తా నరసింహారెడ్డి

వైసీపీ నుంచి టీడీపీలోకి 80 కుటుంబాలు చేరిక: తురక పల్లె, పందిళ్లపల్లె గ్రామల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో తురకపల్లె, పందిళ్లపల్లె గ్రామాలకు చెందిన గోవిందరెడ్డి, రామచంద్రరెడ్డి, రాఘవరెడ్డి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో పుత్తా నరసింహారెడ్డి, పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి సమక్షంలో 80 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. పందిళ్లపల్లె టీడీపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, పరంధామరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చిన్నఓబుల్‌రెడ్డి, చంద్రబాబు, రెడ్డిదస్తగిరి రెడ్డి, మహేష్‌రెడ్డి, గంగిరెడ్డి, ఖాదర్ బాషా, జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దాం: మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 18 : సార్వత్రిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధిద్దామని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కడప నగరం 12వ డివిజన్ శ్రీనగర్‌కాలనీ, 37వ డివిజన్ వక్కలపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో 12వ డివిజన్ జనసేన నాయకులు తుంగా రమణయ్య, శివ రాజగోపాల్, రమా, రవిశంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, ఆనంద్‌నాయుడు, హుసేన్, విజయ, 37వ డివిజన్‌లో యువరాజ్, సుబ్బారెడ్డి, జాకీర్, రాజా, హనీఫ్, ఆసిఫ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో విద్యార్థి విభాగం నాయకుల చేరిక

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : కడప టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి సమక్షంలో కడప నగరానికి చెందిన వైసీపీ విద్యార్థి విభాగం నాయకులు మహేశ్, సిద్దార్థ్, అరుణ్, ఉదయ్, విశ్వతేజ, కిరణ్ టీడీపీ అనుబంధ సంస్థ టీఎన్ఎస్ఎఫ్‌లో చేరారు.



బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాధవీరెడ్డి, జనసేన నేత తుంగా రమణయ్య

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి: కలెక్టర్

చక్రాయపేట, మార్చి 18: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని సమస్యాత్మక గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కుమార్లకాల్వ గ్రామంలో ప్రజలను సమావేశపరచి మాట్లాడారు. ఎలాంటి సమస్యలు లేకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, సమస్యలు తెచ్చుకుంటే నష్టపోతారని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

చెన్నూరు ప్రశాంతతను కాపాడే బాధ్యత మీదే

● పల్లెనిద్రలో సీఐ పార్థసారథి

చెన్నూరు, మార్చి 18 : చెన్నూరు మండలంలో ఎలాంటి సమస్య తలెత్తకుండా ప్రశాంత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మీపైనే ఉందని సీఐ పార్థసారథి అన్నారు. చెన్నూరు బస్టాండులో సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను అన్ని పార్టీలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జరిపించుకోబోతున్నాయని, కావున ప్రజలు అనవసర గొడవల్లో తలదూర్చి ఇబ్బందులు పడకూడదన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ ఎప్పటికీ ఉంటుందని, ప్రజలు నిర్భయంగా నడుచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమాల్లో స్థానిక నేతలు ఇందిరెడ్డి శివారెడ్డి, గోదిన శ్రీనివాసులు, వీరేంద్రబాబు, భైవీరారెడ్డి, ఎఎస్ఐ ఆంజనేయులు, శ్రీకాంత్, రామిరెడ్డి, శ్రీనివాసరాజు, సుబ్రమణ్యంతో పాటు ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



పల్లెనిద్రలో మాట్లాడుతున్న సీఐ పార్థసారథి

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), మార్చి 18 : కడప నగరం నాగరాజుపేటలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. దువ్వూరు మండలంకు చెందిన టంగుటూరు మల్లిఖార్జున సోమవారం మద్యం బాటల్స్ అమ్ముతున్నట్లుసమాచారం రావడంతో అతన్ని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 33 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు.

చంద్రబాబును సీఎంను చేయాలన్నదే లక్ష్యం



అమీర్‌బాబును సత్కరిస్తున్న శివకొండారెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 18 : జీవిత కాలం టీడీపీలోనే ఉంటా, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలన్నదే ఏకైక లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు అమీర్‌బాబు తెలిపారు. సోమవారం కడప నగరంలో రంజాన్‌ను పురస్కరించుకుని టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి అమీర్‌బాబును సత్కరించారు. అమీర్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిని గెలిపించేందుకు సహకరించాలని అమీర్‌బాబును కోరారు. అమీర్‌బాబు స్పందిస్తూ తాను ఉన్నంత కాలం టీడీపీలోనే ఉంటానని చంద్రబాబు సీఎంను చేయాలన్నదే ఏకైక లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాఘవ పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి వితరణ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 18 :కడప నగరం సాయిపేట మహ్మదూర్ రసూలుల్లా అనాథ శరణాలయానికి చాంద్‌బీ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ లయన్ పి.ఖాసింఖాన్ భవన సముదాయ నిర్మాణం కోసం రూ.50వేలు విరాళం అందించారు. రంజాన్ పవిత్రమాసంలో అనాథ శరణాలయానికి విరాళం ఇవ్వడం వల్ల అనాథ శరణాలయం సంస్థ నిర్వాహకులు సయ్యద్ అబ్దుల్ రహిమాన్ ఖాసింఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఖాసింఖాన్ వారి కుటుంబసభ్యులకు రంజాన్‌మాసం పుణ్యం లభించాలని అల్లాహుణు ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. షరీఫ్‌ఖాన్, అనాథ శరణాలయం సభ్యులు సభ్యులు పాల్గొన్నారు.

సువిధ యాప్‌లో అనుమతులు తీసుకోవాలి: ఆర్డీఓ

కడప(కలెక్టరేట్), మార్చి 18: ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలని కడప ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ మధుసూదన్ అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలోని సర్ థామస్ మన్రో మీటింగ్ హాలులో ఎన్నికల నియమావళి, సువిధ యాప్‌పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలను అభ్యర్థులు తూచా తప్పకుండా పాటించాలన్నారు. పార్టీ సమావేశాలకు సంబంధిత పోలీసు అధికారులకు వేదిక, సమయం వివరాలను తెలపాలన్నారు. ఊరేగింపులు ఇరు పార్టీల అభ్యర్థులు ఒకే మార్గంలో ఒకే చోటికి చేరకుండా ఘర్షణలు లేకుండా జరుపుకోవాలన్నారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అభ్యర్థులపై ఎన్నికల పరిశీలకులకు నివేదించ వచ్చన్నారు. అధికార పార్టీ ప్రభుత్వ సొమ్ముతో ప్రకటనలు చేయరాదన్నారు. ఆన్‌లైన్ మోడ్ ద్వారా నామినేషన్ దాఖలు కోసం సువిధ, ఎన్‌కోర్ యాప్‌పై శిక్షణ, ఈసీఐ సువిధ పోర్టల్ ద్వారా నామినేషన్ ఫారమ్‌లు, అఫిడవిట్‌లో వారి వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి అభ్యర్థులకు సదుపాయం కల్పించామన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలు, తదితర వివరాల కోసం చట్టపరమైన సమాచారాన్ని అందించాలన్నారు. అభ్యర్థి మొబైల్ నంబరు రిజిస్ట్రేషన్ చేసి లాగిన్ చేయాలన్నారు అభ్యర్థి వ్యక్తిగత నెట్ బ్యాంకింగ్, ఆన్‌లైన్‌లో సెక్యూరిటీ డిపాజిట్‌ను సమర్పించ వచ్చన్నారు. అనుమతుల జారీకి నోడల్ అధికారులుగా పోలీసు, మున్సిపల్, అడ్మినిస్ట్రేషన్, రవాణా, అగ్నిమాపక, విద్యుత్, ఎయిర్ పోర్టు అథారిటీ శాఖల నుంచి అనుమతులు జారీ చేస్తారని, రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మహమ్మద్ షరీఫ్, తహశీల్దారు శివప్రసాద్, మున్సిల్ సిటీ ప్లానర్ సూర్యకుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్



ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ఎన్ఎస్ఎస్ క్యాంప్

వేంపల్లె, మార్చి 18: గ్రామీణ ప్రాంతాలలో మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య భద్రత, రోడ్డు ప్రమాదాల గురించి ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు ఎన్ఎస్ఎస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామాన్ని ఎన్ఎస్ఎస్ ఇడుపులపాయ మరియు ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సందర్శించారు. ఇందులో భాగంగా ప్రజల సామాజిక స్థితిగతులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఆరు రోజుల పాటు ఈ క్యాంప్ ఉంటుందని ప్రోగ్రాం ఆఫీసర్ తెలిపారు.



కుమ్మరాంపల్లెలో ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు

పులివెందుల రూరల్, మార్చి 18: పదవ తరగతి పరీక్షలు పులివెందుల పరిధిలో సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ రామానాయుడు తెలిపారు. పులివెందుల మండల వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షలకు తొమ్మిది సెంటర్లను ఏర్పాటుచేశారు. అందులో 1697 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 11 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ గంగిరెడ్డి కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించి ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. అలాగే ఓపెన్ స్కూల్ ద్వారా 10, ఇంటర్ పరీక్షలకు 800 మంది పరీక్షలు రాశారని తెలిపారు. ఉదయం 10వ తరగతి రెగ్యులర్, మధ్యాహ్నం ఓపెన్ స్కూల్ 10, ఇంటర్మీడియట్ పరీక్షలు రాసినట్లు తెలిపారు.

చెన్నూరులో... చెన్నూరులో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ తెలిపారు. మొత్తం 351 మంది హాజరు కావాల్సి ఉండగా ఏడుగురు గైర్హాజరై 344 మంది పరీక్ష రాశారన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 183 మంది విద్యార్థులకు గాను 177 మంది, ఆర్ఆర్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 168 మందికి గాను 167 మంది హాజరై ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

లింగాలలో... లింగాల మండలంలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం మొదలైన పదవ తరగతి పరీక్షకు మండల కేంద్రమైన లింగాలలో సెంటర్‌ను ఏర్పాటుచేశారు. మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి 232 మందికి పరీక్షలు రాయాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు : సీఐ

చెన్నూరు, మార్చి 18: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, గొడవలు, ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎం.పార్థసారధి హెచ్చరించారు. సోమవారం మండలంలోని నరసారెడ్డిపల్లె, కొక్కిరాయపల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో చెన్నూరు పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలంటేనే ప్రశాంతతకు నిలయమని, అలాంటి చోట ఎవరూ సమస్యలు కొని తెచ్చుకోవద్దన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. నరసారెడ్డిపల్లె గ్రామంలో 2021లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలు, గతంలో కొన్ని ఎన్నికల సందర్భంలో గొడవలు జరిగి ఇబ్బందులు పడ్డారన్నారు. దీని ద్వారా సామాన్య ప్రజానీకం కూడా తమ దినచర్యలు చేసుకోవడానికి కూడా ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేదని, అలాంటి పరిస్థితులకు ఎవరూ దోహదపడకూడదన్నారు. ఏ సమస్య ఉన్నా సంబంధిత పోలీసు అధికారులకు తెలపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కేంద్ర బలగాలు ఉంటాయని, ఎవరు ఎలాంటి గొడవలకు దిగినా ఇబ్బందులు పడటం ఖాయమని హెచ్చరించారు. స్థానిక నాయకులు కూడా పోలీసు సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలు, ఏఎస్ఐలు జాకీర్‌హుసేన్, రామిరెడ్డి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



నరసారెడ్డిపల్లెలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న దృశ్యం

'జడ్పీ సీఈఓను సస్పెండ్ చేసి చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి'

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 18: జడ్పీ సీఈఓను సస్పెండ్ చేసి చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్వోకు వినతిపత్రం అందించారు. అనంతరం చంద్ర మాట్లాడుతూ నగరంలోని జిల్లాపరిషత్ కార్యాలయానికి కుడి వైపున నిర్మిస్తున్న కాంప్లెక్స్‌లో బహిరంగ వేలం పిలవకుండానే పై అంతస్తులో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యాసంస్థలకు కేటాయించారన్నారు.బహిరంగ వేలం వేయకుండా పై అంతస్తు పూర్తి కాకుండా టెండరు పిలవకుండా ఒక విద్యాసంస్థకు ఏకపక్షంగా ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ దృష్టికి తీసుకుపోయి స్టాండింగ్ కౌన్సిల్‌లో కూడా ఆమోదం తెలిపారని జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి చెప్పారన్నారు. వెంటనే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సీఈఓను సస్పెండ్ చేసి, చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.వెంకటశివ, ఎంవీ సుబ్బారెడ్డి, గంగాసురేష్ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న గాలిచంద్ర

21 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

వల్లూరు, మార్చి 18 :మండల పరిధిలోని పాపాఘ్ని నది సమీపంలోని మాచిరెడ్డిపల్లెలో లక్ష్మీనరసింహ స్వామి 28వ వార్షికోత్సవాన్ని ఈ నెల 21 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఈ ఐదు రోజుల పాటు నరసింహస్వామి ఆలయంలో వివిధ పూజలు, హోమాలు ఉంటాయని ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. 25న వివిధ పూజలు, అభిషేకాలు, హోమాలు చేసిన అనంతరం 9 నుంచి 10 గంటల్లోపు లక్ష్మీనరసింహస్వామి వారికి మహాపూర్ణాహుతి ఉంటుందని, అనంతరం అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. మధ్యాహ్నం 11.20కు లక్ష్మీనరసింహ కల్యాణాన్ని నిర్వహించి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు.



లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్

బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ పోటీలు

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23న రాత్రి 9 గంటలకు రంగస్థల పద్యపోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.4వేలు, రెండోబహుమతి 3వేలు, మూడోబహుమతి 2వేలు, నాలుగో బహుమతి వెయ్యి ఉంటుందన్నారు. 24న రాత్రి 9 గంటలకు తాళం భజన పోటీలు ఉంటాయని, పాల్గొనే వారు గంట ముందు తమ పేర్లను దేవస్థానం వద్ద నమోదు చేసుకోవాలన్నారు. వరుసగా మొదటి బహుమతి రూ.12వేలు, 8వేలు, 6వేలు, 4వేలు ఉంటుందన్నారు. అలాగే ఆదేరోజు ఉదయం 9గంటలకు ట్రాక్టరు ట్రాలీ రివర్స్ పోటీలు ఉంటాయని, రూ.2వేలు, 1500, వెయ్యి బహుమతులు అందిస్తామన్నారు. 25న సోమవారం ఉదయం 9గంలటకు చెక్కభజన పోటీలు ఉంటాయని, మొదటి బహుమతి రూ.15వేలు, 10వేలు, 5వేలు, అలాగే ఉదయం 10గంటలకు అల్లెంగుండు పోటీలు నిర్వహించి రూ.2500, 1500, వెయ్యి బహుమతులు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు పాలపళ్ల వృషమరాజములచే రాతిదూలం పోటీలుంటాయని, వరుసగా మొదటి బహుమతి రూ.30వేలు, 25వేలు, 20వేలు, 10వేలు, 8వేలు, 5వేలు ఉంటాయన్నారు. స్వామి వారి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పుత్తా కోరారు.

శాస్త్రీయ అవగాహనతో మూఢనమ్మకాలను పారదోలవచ్చు

● జేవీవీ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు

కడప (ఎడ్యుకేషన్), మార్చి 18 : శాస్త్రీయ అవగాహనతో మూఢనమ్మకాలను పారదోలవచ్చని జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, బాలబయన్న, సమతా విభాగం అధ్యక్షురాలు సునీత తెలిపారు. సోమవారం వైవీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మిట్టమీదపల్లెలో మూఢ నమ్మకాలపై అవగాహన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతిక పురోభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఇంకా మూఢ నమ్మకాలు తగ్గలేదన్నారు. విద్యార్థులు ప్రశ్నించడాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. బాబాలు మంత్రాలు, భయాలు వట్టి బూటకాలని వాటి వెనుక ఉన్న మోసాలను గుర్తించాలన్నారు. మూఢనమకాల వెనుక ఉన్న వాస్తవాలపై శాస్త్రీయంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో సునీత పాల్గొన్నారు.



మూఢనమ్మకాలను పారదోలేందుకు అగ్గితో విన్యాసం చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి

వేంపల్లె, మార్చి 18: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వేంపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ సునీత సూచించారు. సోమవారం మండలంలోని అలవలపాడు గ్రామంలో అంగన్వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించి తల్లీబిడ్డల సంరక్షణ అనే అంశంపై మాట్లాడారు. రక్తహీనత, పిల్లల లోపపోషణ, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ, పిల్లల్లో పెరుగుదల పర్యవేక్షణ, గర్భం ధరించినపుడు నుంచి పిల్లాడికి రెండు సంవత్సరాల వయసు వరకు పోషణ, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు గురించి తెలిపారు. చౌకగా లభించే ఆకుకూరలు, కూరగాయల ద్వారా లభించే పోషకాల గురించి వివరించారు.అంగన్వాడీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోషకాల గురించి వివరిస్తున్న సీడీపీఓ సునీత

20 కుటుంబాలు టీడీపీలో చేరిక



కె.సుగుమంచిపల్లె గ్రామంలో భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన దృశ్యం

కొండాపురం, మార్చి 18:మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామంలో 20 కుటుంబాలు సోమవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు.గ్రామానికి చెందిన రవి,సూర్యనారాయణ,వంశీ,రుషిచిన్నన్న,సుదర్శన్‌రెడ్డి,రంగేశ్వర్‌రెడ్డి తదితర కుటుంబాల వారు టీడీపీ లో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని భూపేశ్ టీడీపీలోకి ఆహ్వానించారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి , టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుట్టా ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరిక



పార్టీలోకి చేర్చుకొంటున్న పుట్టాసుధాకర్ యాదవ్

మైదుకూరు, మార్చి 18 : స్థానిక మున్సిపల్ 12వ వార్డు మాజీ కౌన్సిలర్ కవితాబచ్చన్ భర్త అమీర్‌తో పాటు పలువురు వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలోకి చేరారు. సాయినాధపురానికి చెందిన వైసీపీ నాయకులు దావుద్ బాష, జాకీర్, మన్సూర్, పక్రుద్దీన్, సుబ్బరాయుడు తదితర దాదాపు 30 కుటుంబాల వారు ప్రొద్దుటూరులోని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ నివాసానికి చేరుకున్నారు. ఆయన సమక్షంలో టీడీపీలోకి చేరారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపిస్తామంటూ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల క్రిష్ణయ్య, పాశం మారుతి, అక్బర్, రాకెట్ రఫీ, కొండపల్లి ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వరదరాజులరెడ్డి, కొండారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 18: టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ వాల్‌పోస్టర్లను తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి, యువ నాయకుడు ఎన్.కొండారెడ్డి ఆవిష్కరించారు. తొలిసారి ఓటు వినియోగించుకునే యువతీయువకులు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి విజనరీ కావాలి, ప్రిజనరీ వద్దు అనే లక్ష్యంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరప్రతాప్, రామచంద్రారెడ్డి, రాఘవరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామనూరు రాజేష్, రాహుల్, వాసు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి : భూపేశ్

కొండాపురం, మార్చి 18: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని యస్.తిమ్మాపురం గ్రామంలో సోమవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబు కే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణ రెడ్డి,టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణారెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి , సర్పంచ్ వెంకట ప్రతాపుడు,మాజీ సర్పంచ్ బాబుల్‌రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

చరిత్రలో చెరగని చిరునామా పాట ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 18: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటి వరకు బీసీ సామాజిక వర్గం చరిత్రలో చెరగని చిరునామాగా నిలిచిందని కవి మురళీమోహన్‌రాజు పేర్కొన్నారు. మైదుకూరు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ గెలుపును ఆకాంక్షిస్తూ రూపొందించిన చరిత్రలో చెరగని చిరునామా ఆడియో పాటను ఆవిష్కరించారు. సోమవారం వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో పుట్టాసుధాకర్‌యాదవ్ ఆడియో పాటను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, ఉమాకాంత్, టీడీపీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



రాజుపాలెంలో పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 18: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రొద్దుటూరు మండలంలో 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 3,824 మందివిద్యార్థులను కేటాయించారు. తొలి రోజు 3,765 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 59 మంది గైర్హాజరయ్యారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తుండడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు గంటముందే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతోపాటు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మైలవరం..: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 436 మంది పదో తరగతి విద్యార్థులకు గాను 434 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్లలో పది పరీక్షలు మొదటిరోజున ప్రశాంతంగా జరిగాయి. ఐదు కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. 818మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 817మంది విద్యార్థులు, 37మంది ప్రైవేటు విద్యార్థులకు గాను 21మంది విద్యార్థులు పరీక్షకు హాజరైయ్యారు. ప్రతి సెంటర్‌లో సిట్టింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయగా, ఫ్లైయింగ్ స్క్వాడ్ కూడా పర్యవేక్షించింది. ఎంఈవో శివప్రసాద్‌తో కలిసి డిప్యూటీ డీఈవో క్రిష్టప్ప, డిప్యూటీ తహసీల్దార్ మాదవీలత ఫ్లైయింగ్ స్క్వాడ్‌గా వచ్చారు. పరీక్ష కేంద్రాలను వారు పరిశీలించారు.

పోరుమామిళ్ల..: పదో తరగతి పరీక్షలు సోమవారం పోరుమామిళ్లలో ప్రారంభమయ్యాయి. పోరుమామిళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓఎల్ఎఫ్ హైస్కూలులో 160 మంది. శ్రీ చైతన్య హైస్కూలులో 160 మంది హాజరు కాగా, ఒకరు గైర్హాజరయ్యారు. హోలిరోసరీ ఇంగ్లీషు మీడియం హైస్కూలులో 218 మంది హాజరు కాగా ఒక విద్యార్థి గైర్హాజరయ్యారు. శ్రీ వైష్ణవి ఇంగ్లీషు మీడియం హైస్కూలులో 157 మంది హాజరయ్యారు .ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 144మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. వెంగమాంబ హైస్కూలులో 159 మంది హాజరయ్యారు. మొదటిరోజు తెలుగు పరీక్ష నిర్వహించారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు పట్టణంలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో అధికారులు రెగ్యులర్ పదో తరగతి విద్యార్థులకు 8 సెంటర్లను ఏర్పాటు చేశారు. అందులో పీఆర్ హైస్కూలు 220 మందికి 210 మంది పరీక్ష రాశారు. బాలికల ఉన్నత పాఠశాలలో 192కు 190 మంది, బాలాజీ హైస్కూలులో 196కు 193 మంది, గౌతమ్ స్కూలులో 155కు 154 మంది, గీతాంజలిలో 177కు 175 మంది, సెయింట్‌మేరీస్ (సెంటర్-ఎ) 217కు 214 మంది, బి-సెంటర్‌లో 188 మందికి 180 మంది, జిల్లా పరిషత్ మార్కెట్ హైస్కూలులో 151కి 150 మంది పరీక్షకు హాజరయ్యారు.

ముద్దనూరు..: మండల కేంద్రంలో సోమవారం పది పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.బాలుర, బాలికల ఉన్నత పాఠశాల రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు ఉన్నత పాఠశాలలు ఉప్పలూరు, యామవరం, ఆర్‌జీపల్లె ప్రభుత్వ, సువిధ, మహర్షి, థెరిస్సాడీలీమా ప్రవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 179 మంది విద్యార్థులకు 176 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. బాలికల ఉన్నతపాఠశాల కేంద్రంలో 160 మంది విద్యార్థులకు 159 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈవో నాగేశ్వరరావునాయక్ తెలిపారు.

గోపవరం..: పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమైంది. మండలం నుంచి 846 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఈ విషయంపై ఎంఈవో చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాశారన్నారు. మొత్తం రెండుసెక్షన్లలో 336 మంది హాజరు

రాజుపాలెం..: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. మండలంలో 8 జడ్పీ పాఠశాలల, 3 ప్రైవేటు పాఠశాలలు, వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులపాఠశాల విద్యార్థులు ఏ-సెక్షన్‌లో 166 మంది, బీ- సెక్షన్‌లో 170 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 8 మంది సప్లిమెంటరీ వద్యార్థులు తెలుగుపరీక్షకు హాజరు కాలేదని చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

రాచమల్లును ఓడించడమే లక్ష్యం

వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి



ప్రొద్దుటూరు, మార్చి 18 : రాచమల్లును ఓడించడమే తమ లక్ష్యమని, ప్రొద్దుటూరులో ఆయనకు వైసీపీ టికెట్టు ఇస్తే ఘోరంగా ఓడిపోతారని తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వుందని పార్టీ అధిష్టానానికి అసమ్మతి నేతలమంతా స్పష్టం చేశామని ఆపార్టీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొర్రపాడు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రసాద్‌రెడ్డి నన్ను పార్టీ సస్పెండ్ చేసిందని అతనిపై అసమ్మతి లేదని శివచంద్రారెడ్డి కూడా అధిష్టానం చెప్పినట్లు రాచమల్లుతో కలిసి పనిచేసే దానికి ఒప్పుకున్నాడని తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. అందుకే శివచంద్రారెడ్డి దానిని ఖండించారన్నారు. రాచమల్లు ఓటమే తన లక్ష్యంగా శివచంద్రారెడ్డి ప్రకటించారన్నారు. నన్ను పార్టీ సస్పెండ్ చేసివుంటే అధిష్టానం సజ్జల, ధనుంజయరెడ్డి, అవినాష్‌రెడ్డి తదితరులు అసమ్మతి నేతలందరినీ ఎందుకు పిలిపించారన్నారు. నేను గానీ శివచంద్రారెడ్డి గానీ ఎవ్వరం రాచమల్లుకు చెంచాగిరి చేయం కాబట్టి మమ్మల్ని అణగదొక్కేందుకు ప్రయత్నిస్తు దెబ్బ తీస్తున్నాడన్నారు. రాచమల్లు వెంట 80 శాతం మంది అతని ప్రలోభాలకు భయాలకు వుంటున్నారు తప్ప అతని పై ప్రేమ అభిమానంతో లేరన్నారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ బీసీ నాయకుడన్నారు. అతనిని ప్రొద్దుటూరులో లేకుండా చంపుతామని భయపెట్టి రాచమల్లు ఊరువిడిపించాడన్నారు.అతను జమ్మలమడుగు మైదుకూరు కమలాపురంలో పార్టీ ప్రచారం చేస్తున్నాడు తప్ప ప్రొద్దుటూరులో రాచమల్లుకు ఓటేసి గెలిపించమని ప్రచారం చేశాడా అన్నారు. త్వరలో కార్యకర్తల మీటింగ్ పెట్టి నిర్ణయం తీసుకుంటామని మురళీధర్‌రెడ్డి తెలిపారు.

టీడీపీ గెలుపు కోసం ఐక్యంగా పోరాడుదాం

సీఎం సురేష్ నాయుడును కలిసిన వరదరాజులరెడ్డి



సీఎం సురేశ్‌నాయుడుతో మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి, కొండారెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 18 : ప్రొద్దుటూరులో వైసీపీని ఓడించి రాచమల్లు లాంటి ప్రజావ్యతిరేకిని గద్దెదింపేందుకు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించేందుకు ఐక్యంగా పోరాడుదామని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, సీఎం సురేశ్ నాయుడుతో కలిసి ప్రకటించారు. సోమవారం పీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని టీడీపీ కార్యాలయంలో వున్న సీఎం సురేష్ నాయుడును మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల కొండారెడ్డి కలిసి మాట్లాడారు. ప్రొద్దుటూరు టీడీపీ టికెట్టు వరదరాజులరెడ్డికి ప్రకటించాక ఆయన టీడీపీలోని నాయకులందరినీ కలుపుకుని పోవడంలో భాగంగా సోమవారం సురేష్ నాయుడును కలిసి చర్చించారు. త్వరలో అందరితో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తామని సురేశ్‌నాయుడు తెలిపినట్లు వారు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు లక్ష్యం : పుట్టా

బ్రహ్మంగారిమఠం, మార్చి 18 : రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు లక్ష్యమని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొత్తూరు, పాతూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ చేపట్టబోయే సంక్షేమ ధకాల గురించి ప్రజలకు తెలిపారు. అంతకు ముందు కొత్తూరు గ్రామం టీడీపీ నేతలు తిప్పన జయరాంనాయుడు, ప్రముఖ లాయరు పట్టాభిరాం, తిప్పనరాఘవేంద్ర నాయుడు, తిప్పన ధర్మానాయుడు స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుట్టా సుధాకర్‌యాదవ్ గడప గడపకు వెళ్లి తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టో గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, జనసేన పార్టీ నాయకులు మల్హోత్రా, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వివేకానందరెడ్డి, లాయర్ పట్టాభి, జయరాంనాయుడు, రాఘవేంద్ర, ధర్మా, సర్పంచ్ నారాయణ, పూజా శివయ్యయాదవ్, వెంకటేశ్‌నాయుడు, బాలగౌడ్, నరసింహగౌడ్, వినోద్, మేకల రమణయ్య, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి రోడ్డు ఏర్పాటు చేయండి



ధర్నా చేస్తున్న చిన్న అగ్రహారం గ్రామస్థులు

బద్వేలు, మార్చి18: చిన్న అగ్రహారంలో రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఆక్రమణలను తొలగించి నూతన సీసీ రోడ్డు పనులను చేయాలని చిన్నఅగ్రహారం గ్రామస్థులు ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. గతంలో రోడ్డు 20 అడుగులు వెడల్పు ఉండేదని కొంతమంది రోడ్డును ఆక్రమించడంతో 10 అడుగులు కూడా లేదని దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ గ్రామానికి సీసీ రోడ్డు నూతనంగా మంజూరైందని ఆక్రమణలు తొలగించి నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని కోరారు. అధికారులు స్పందించి సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు వెంటేశ్వర్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

'టీడీపీ అభిమానిని కొట్టిన ఎస్‌ఐ'

చాపాడు, మార్చి 18: మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన షేక్ షఫి అనే టీడీపీ అభిమానిని ఎస్‌ఐ కొండారెడ్డి కట్టెతో కొట్టినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు పల్లవోలు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. ఈనెల 17న ఉదయం 11 గంటల సమయంలో పల్లవోలు గ్రామం వద్ద సీబీఐటీ కాలేజీ ఎదురుగా మోటారు సైకిల్‌పై షఫి వెళుతుండగా పట్టుకుని కొట్టాడన్నారు. మోటారుసైకిల్‌పై పల్లవోలు గ్రామానికి ప్రచారానికి వెళుతుండగా ఈ సంఘటన జరిగిందన్నారు. ఈ విషయమై ఎస్‌ఐ కొండారెడ్డిని వివరణ అడుగగా తాను షేక్ షఫిని కొట్టలేదన్నారు. సీబీఐటీ కాలేజీలో గ్రూప్-1 పరీక్ష జరుగుతున్నందున 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎలాంటి లౌడ్‌స్పీకర్లు పెట్టుకోకుండా వెళ్లాలని అతనికి చెప్పానన్నారు.

ముగ్గురు విద్యార్థులు గైర్హాజరు

కొండాపురం, మార్చి 18: మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలలో ముగ్గురు విద్యార్థులు తెలుగు పరీక్ష కు గైర్హాజరైనట్లు ఎంఈవో ఓబులేసు తెలిపారు.గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు.కాగా కేంద్రాలను కొండాపురం సీఐ వేణుగోపాల్,ఎస్ఐ యోగీంద్ర తనిఖీ చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 18: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను సమర్పించారు. రెండు నెలలకు భక్తులు రూ.1,35,126లను స్వామి, అమ్మవార్లకు కానుకగా సమర్పించారు. సోమవారం పర్యవేక్షణాధికారి పాండురంగారెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 18: ఆరుద్ర నక్షత్రహోమం పురస్కరించుకుని సోమవారం అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్‌కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఇరగం మల్లీశ్వరి, న్యాయవాది ఈవీ సుధాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చాపాడు, మార్చి 18: మండలంలోని రామదాసుపురం గ్రామానికి చెందిన చెర్లపల్లె హనుమంతు అనే బాధితునికి జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి సోమవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈనెల 15వ తేదీన హనుమంతు రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చెప్పారు. ప్రొద్దుటూరులోని ఆస్పత్రిలో అతను చికిత్స పొందుతుండగా మునిశేఖర్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

అసత్య ప్రచారాలు చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటాం

బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కమలమ్మ

పోరుమామిళ్ల, మార్చి 18 : తనపై అసత్య ప్రచారాలు చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని బద్వేలు మాజీ ఎమ్మెల్యే కమలమ్మ అన్నారు. సోమవారం ఆమె స్వగృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనపై కరపత్రాల ద్వారా తన ప్రతిష్ట దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. రంగసముద్రం పంచాయతీలోని సర్వే నెంబరు 1090, 1094ల విస్తీర్ణంలో ఇంటి స్థలం 63 సెంట్లు కబ్జా చేసినట్లు కరపత్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారని తాను ఎవరి స్థలాన్ని ఒక్క సెంటు కూడా కబ్జా చేయలేదన్నారు. పై రెండు నెంబర్లలో కబ్జాలతో తనకు సంబంధంలేదన్నారు. 1095సర్వేనెంబరులో తాను 23 సెంట్ల స్థలం కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానే తప్ప ఎవరిదీ ఒక సెంటు కూడా కబ్జా చేయలేదన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రిజిస్ట్రేషన్ పత్రాలు తన వద్ద ఉన్నాయన్నారు. పై రెండు నెంబర్లకు ఎలాంటి సంబంధలేదని తనపై అసత్య ప్రచారాలు చేసేవారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కమల్ ప్రభాస్ పాల్గొన్నారు.

ఖాజీపేటలో విచ్చలవిడిగా కాపీలు



కిటికీల వద్ద కాపీలు వేస్తున్న యువకులు

ఖాజీపేట, మార్చి 18: ఎంతో పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు జరపాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ఖాజీపేటలో పోలీసులు, ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారు. సోమవారం ఖాజీపేటలో మూడు సెంటర్లలో దాదాపు 549 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా కొంతమందికి కాపీలు అందుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. ఏడాదిగా కష్టపడి చదివిన విద్యార్థుల పరిస్థితి ఏమిటని అందరినీ ఒకేతాటిపైకి తీసుకురావడం ఏమిటన్న విమర్శలు వస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం మా స్కూల్ మండల ఫస్ట్ రావాలంటూ పైరవీలు చేస్తున్నట్లు వినికిడి. విచ్చలవిడిగా గోడలు దూకి స్కూలులోకి వెళ్లి రెండో అంతస్థులోని కిటికీల నుంచి కాపీలు అందిస్తుంటే అక్కడ ఉన్న పోలీసులు ఏమి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఏది ఏమైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పరీక్షలు సజావుగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

● తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ మధ్య వాగ్వాదం

తొలిరోజు పిల్లలు ఎంతో సంతోషంగా పరీక్షలు రాసేందుకు వచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తనిఖీలు చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు వాగ్వాదానికిదిగారు. ఆడపిల్లలను తనిఖీ చేసే బాధ్యత మీకెక్కడిది, మీ ఇష్టానుసారంగా తనిఖీ చేస్తే ఊరుకోమంటూ వాగ్వాదానికి దిగారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌భాను, డీఎస్పీ మురళీధర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష




ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఆర్వోలు కౌసర్‌భాను, ఆర్వోలు శ్రీనివాసులు తదితరులు

ప్రొద్దుటూరు,మార్చి 18: సార్వత్రిక ఎన్నికలను ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ప్రొద్దుటూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్ బాను పేర్కొన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష్, డీఎస్పీ మురళీధర్, తహసీల్దారు విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డిలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అన్ని రాజకీయ పార్టీలు సమానమేనని ఏ ఒక్క పార్టీకి అనుగుణంగా అధికారులు ఎవ్వరూ వ్యవహరించరాదన్నారు. రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ఎవ్వరైనా ఎలాంటి మీటింగ్‌లు, ర్యాలీలు, ధర్నాలు లాంటి కార్యక్రమాలకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాకాకుండా మీటింగ్‌లు పెట్టినా ర్యాలీలు చేపట్టినా కేసులు నమోదు చేయబడతాయన్నారు. ఎన్నికల కోడ్ నియమావళిని ఉల్లంఘనలపై సి విజిల్ అనే యాప్‌లో ఫిర్యాదు చేస్తే 90 నిమిషాలలో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విద్యాసాగర్, రాజుపాళెం తహసీల్దార్ విజయశ్రీ, ఎన్నికల డీటీలు అజయ్‌బాబు మనోహర్‌రెడ్డి సీఐ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

● జమ్మలమడుగు ఆర్వో శ్రీనివాసులు

జమ్మలమడుగు, మార్చి 18: జమ్మలమడుగు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో సోమవారం సాయంత్రం నియోజకవర్గంలోని పొలిటికల్‌పార్టీ నాయకుల ప్రతినిధులతో ఆర్వో శ్రీనివాసులు, డీఎస్పీ యశ్వంత్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్వో మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయరామరాజు ఇచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేసినా ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. అనుమతులు తీసుకోకుండా కోడ్ ఉల్లంఘన చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఖర్చు, అధికారులు గమనిస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకుల ప్రతినిధులు సీతారాముడు, పోచిరెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆకుల బాబా, విశ్వనాథరెడ్డి, సిబ్బంది మస్తాన్, బాష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.